# మజాకార్లు !

మనుషుల్లో రెండు రకాల వాళ్ళున్నారు. తమ సుఖాలకోసం బతికే వాళ్ళు, ఇతరులను సుఖ పెట్టడం కోసం బతికేవాళ్లూన్నూ. పురుషులందు పుణ్య పురుషులు వేరయ్యా అన్నారేగాని పురుషులందు సుఖ పురుషులు వేరయా అనుకుంటే బేషుగ్గా ఉండేది. ఈ సుఖ పురుషులు తమ ఆనందంకోసం, మజాకోసం ఎంతకైనా సిద్దమే . వీళ్ళని మజా కార్లని పిల్చుకున్నా అందంగానే ఉంటుంది. వీళ్ళకి ఎంత దూరంగా ఉంటే అంత మంచిది. యాక్సిలేటర్సేగాని బ్రేకులుండని సుఖ వాహనాలు వీళ్ళు , దూసుకెళ్ళటమేగాని, ఓ క్షణం నిలబడి ఆలోచించటం తెలీని వాళ్ళు.

మా ఊళ్ళో ఓ ఆయుర్వేదం మందులు తయారు చేసే కంపెనీ యజమాని ఒకాయనుండేవాడు. చెట్టంత మనిషి .మెళ్ళో గొలుసులు, వేళ్ళకి ఉంగరాలు, సిల్కు చొక్కాలు, జమిందారు బాబులా ఉండే వాడు. పక్క వీధిలో ఉండగానే విదేశీ సెంటు కంపు గుప్పున కొట్టేది. భార్యని పిల్లల్ని పట్టించుకోక, మజావేటలో తిరుగుతూ , వీధికొక వీరవనితతో రాసక్రీడలు ఒలింపిక్ గేమ్స్ స్థాయిలో నడిపేవాడు.

చివరికి ఆస్థి మొత్తం హరించి , వ్యాపారం దెబ్బతిని , ఆరోగ్యం పాడై అద్దె ఇంటి అరుగుపైన తవ్వకాల్లో దొరికిన వేమన విగ్రహంలాగా కూర్చుని వెర్రి చూపులు చూస్తుండేవాడు.

ఈ మజాకార్లలో మళ్ళీ రెండు రకాలవాళ్ళున్నారు. స్థోమత ఉండి అనుభవించే వాళ్ళు, స్థోమతలేకపోయినా ఎగబడి తిరిగేవాళ్ళు. ఇళ్ళల్లో వాళ్ళని దిష్టిబొమ్మల్లాగా కూర్చోపెట్టి తాము మాత్రం నీటుగా ముస్తాబయి, త్రిబుల్ ఫైవ్ కాల్చే ప్రబుద్దులూ మనలో ఉన్నారు. భార్యని పుట్టింటికి పంపించి ఇంట్లో దుకాణాలు తెరిచే వాళ్ళోరకం. పెళ్ళాం ఊళ్ళో లేకపోతే వీళ్ళని పట్టుకోవడం కష్టం. అలాగే ఇంట్లో భార్యకి కట్టుకథలు చెప్పి రాత్రి సమయాల్లో బయటపడే వాళ్ళో రకం. మా ఫ్రెండు భార్యకి కుక్కకరిచిన వాళ్ళంటే బోల్డంత సానుభూతి దానిక్కారణం ఏమిటంటే, ఆవిడ పుట్టింటి వారికి కుక్కలు తరచూ కరుస్తుంటాయట. అంచేత మా ఫ్రెండు ఎప్పుడూ బయట గడపాలన్న

కుక్కల్నే వాడుకుంటాడు. ( అపార్థం ధ్వనిస్తే క్షమించాలి ). ఇవాళ మా క్యాషియర్ కనకారావు లేడు వాడ్ని కుక్క కరిచిందోయ్. ఆస్పత్రిలో ఉన్నాడు. చాలా సీరియస్సుగా వుంది. వోపెన్ హార్ట్ సర్జరీ చేయాలంటున్నారు. అంచేతనే రాత్రికి రాను జాగ్రత్త. తలుపు వేసుకో ' అంటూ కథ చెప్పి మజాల వీధికి వెడతాడు మా వాడు, ఈ మజాకార్లని చూసి మామూలు వాళ్ళు ఈర్ష్యపడటం, అలాగే మామూలు వాళ్ళని చూసి ఈ మజాకార్లు జాలిపడటం జరుగుతుంటుంది.

ఈ మధ్యన ఓ పెద్ద మనిషి సుఖాన్వేషణలో దేశ సంచారం ప్రారంభించేడు. ఏడాదిపాటు తిరగని ఊరు తిరక్కుండా తిరిగి, సరసుల్ని, సన్యాసుల్ని, గుళ్ళూ గోపురాల్ని , ఎర్రదీపం వీధుల్ని తిరిగి, పుణ్యనదుల్లో స్నానాలు, ప్రముఖ హొటళ్ళల్లో పానాలు చేసి, సుఖం అడ్రసు తెలీక తెల్లమొహం వేసుకుని ఇంటికి తిరిగొచ్చేట్ట. రాగానే భార్య అడిగిందట వెళ్ళిన పనయిందా అని. లేదన్నట్టు, లోపలికెళ్ళి లుంగీ కట్టుకుని , పాతకాలం చెక్కకుర్చీని తెచ్చి దొడ్లో చెట్టుకిందేసుకూర్చుని, పాక్కుంటూ వద్దకొచ్చిన ఏడాది కొడుకుని గుండెలపైన వేసుకుని, అప్పుడనుకున్నాట్ట. సుఖం ఎక్కడో లేదు. ఇక్కడే ఉంది సుమాని. ఇలా ఉంటాయి ఈ మజాకార్ల ఎండమావి వెంట పరుగులు.

భర్తని, పిల్లల్ని సుఖపెట్టటంలోనే ఆనందం ఉందని ఆడవాళ్ళు అనుకుంటారు కాబట్టి సరిపోయింది. గానీ , వాళ్ళు కూడా ఇదే బాట్లో పరిగెట్టటం ప్రారంభిస్తే, ఇహ మగాళ్ళకి తిండీ, నిద్రలూ, ఉండవ్. బీపీలు రైజయ్యి. గుండె జబ్బు వొచ్చి పడగలవ్. అంచేత భార్యని , పిల్లల్ని సుఖ పెట్టటంలోనే నిజమైన ఆనందం, తృప్తి ఉన్నాయనే సంగతి గ్రహించి, కాలాన్ని , డబ్బుని, ఆరోగ్యాన్ని వాళ్ళకోసం ఖర్చుచేయటం మంచిది. కాదని బరితెగిస్తే మూడక్షరాల విదేశీ జబ్బుందన్న విషయం ఈ మజాకార్లు గుర్తిస్తే బెటర్ !

------- అయ్యిపోయింది -------